సాక్షి
ఖమ్మం
శనివారం । 30 । మార్చి । 2024



సెలవులకు ముందే సందడి!

వేసవి సెలవులు మొదలుకాక ముందే ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంకు విద్యార్థులు శిక్షణ కోసం బారులుదీరుతున్నారు. 8లో



.. ప్రశాంతంగా ఉండాలి..

ప్రశాంత వాతావరణం ఉట్టిపడేలా భద్రాద్రిని తీర్చిదిద్దాలని దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్ సూచించారు. 8లో



వాతావరణం

జిల్లా అంతటా శనివారం గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్
(శనివారం సా॥)
6.28

సహర్
(ఆదివారం ఉ॥)
4.42



ప్రభువు త్యాగం.. అజరామరం

సర్వ మానవాళి సౌభ్రాతృత్వం, ప్రపంచ శాంతి, ప్రజల పాప పరిహారార్థం ఏసుప్రభువు సిలువ మోసిన రోజుకు గుర్తుగా 'గుడ్ ఫ్రైడే'ను జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అలాగే, ఏసు సిలువ మోసిన విధానాన్ని కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. ఈ ప్రదర్శనల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనగా, ప్రజల కోసం ఏసు చేసిన త్యాగాన్ని వివరించిన మతపెద్దలు ఆయన బాటలో నడవాల్సిన ఆవశ్యకతను తెలిపారు.

కల్లూరులో నిర్వహించిన ఏసుప్రభువు సిలువ యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి, భక్తులు

ఖమ్మంలో ఏసుక్రీస్తు వేషధారణలో సిలువ మోస్తున్న భక్తుడు



న్యూస్‌రీల్

పకడ్బందీగా రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలు



సిబ్బందికి ఇచ్చే టీ షర్ట్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్, సీపీ సునీల్‌దత్, అధికారులు

ఖమ్మంరూరల్: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఈవీఎంల రిసెప్షన్, ఓట్ల లెక్కింపు కేంద్రాలకు సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. ఖమ్మం రూరల్ మండలం పొన్నేకల్‌లోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలను సీపీ సునీల్‌దత్‌తో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా పోలింగ్ ముగిశాక తీసుకొచ్చే ఈవీఎంల భద్రత, ఓట్ల లెక్కింపునకు చేయాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ప్రత్యేక గదులు సిద్ధం చేయాలని, విద్యుత్ ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇప్పటికే ఉన్న అగ్నిమాపక పరికరాలకు తోడు మరిన్ని అదనంగా సమకూర్చుకోవాలని, స్ట్రాంగ్‌రూంల అలారంను పరిశీలించాలని చెప్పారు. ఈకార్యక్రమంలో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి, అదనపు కలెక్టర్ పి.మధుసూదన్‌నాయక్, అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్‌సింగ్, యువరాజ్, ట్రెయినీ ఐపీఎస్ పి.మౌనిక, వివిధ శాఖల అధికారులు శ్యాంప్రసాద్, ఎం.రాజేశ్వరి, శ్రీలత, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్?

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధిలోని పాఠశాలల్లో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) సిలబస్ అమలుకు ఎడ్యుకేషన్ సొసైటీ సన్నాహాలు చేపట్టింది. ఈ మేరకు సింగరేణి వ్యాప్తంగా ఉన్న తొమ్మిది పాఠశాలల్లో కార్మికుల పిల్లలు ఎందరు చదువుతున్నారు.. వారిలో స్టేట్ సిలబస్‌పై ఎందరికి ఆసక్తి ఉంది.. సీబీఎస్‌ఈ సిలబస్‌లో ఎంత మంది చదివించాలనుకుంటున్నారనే వివరాలు ఆరా తీస్తున్నారు. ఈ విషయమై ఈ నెల 26వ తేదీన జారీ చేసిన ఉత్తర్వుల ఆధారంగా అధికారులు వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. ఏప్రిల్ 1వ తేదీ నాటికి కార్పొరేట్ కార్యాలయానికి అందే నివేదిక ఆధారంగా అధికారులు సీబీఎస్‌ఈ సిలబస్ అమలుపై నిర్ణయం తీసుకునే అవకాశముందని సమాచారం.

అత్యవసర వైద్యంపై అవగాహన తప్పనిసరి



వైద్యులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డైరెక్టర్

సింగరేణి(కొత్తగూడెం): సీపీఆర్ (అత్యవసర వైద్యం)పై అందరూ అవగాహన కలిగి ఉండాలని సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్ అండ్ పా) ఎన్‌వీకే శ్రీనివాస్ తెలిపారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో రెండు రోజులుగా వైద్యులు, సిబ్బందికి ఈఎంఆర్ఐ వైద్యుల ఆధ్వర్యాన అత్యవసర వైద్యంపై ఇస్తున్న శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డైరెక్టర్ మాట్లాడారు. సింగరేణి ఉద్యోగులు, కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఇప్పటికే ఆస్పత్రులను ఆధునీకరించి, నిపుణులైన వైద్యులను నియమించామని తెలిపారు. సింగరేణీయులకే కాకుండా ప్రభావిత గ్రామాల్లో ప్రజలకు వైద్యం అందించటానికి క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ మేరకు వైద్యులు, సిబ్బందికి శిక్షణ ఇస్తుండగా, అత్యవసర సమయాల్లో మెరుగైన వైద్యం అందించాలని డైరెక్టర్ శ్రీనివాస్ సూచించారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న వైద్యులు, సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సీఎంఓ సుజాత, ఏసీఎంఓ విక్టర్ వందనం, డీవైసీఎంఓ సునీల, మట్రోన్ మిస్, డాక్టర్లు కృష్ణమూర్తి, వి.శ్రీనివాసరావు, మాలతి, ఈఎంఆర్ఐ డాక్టర్లు నవీన్, జావిద్, సతీశ్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కడుపులోనే కనుమరుగు

ఖమ్మంలోని ఆదిత్య ఆస్పత్రిలో అబార్షన్లు నిర్వహిస్తున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఓ మహిళను వెంటపెట్టుకుని వెళ్లి డెకాయ్ ఆపరేషన్ నిర్వహించారు. అబార్షన్ చేసేందుకు యాజమాన్యం అంగీకరించడంతో కేసు నమోదుచేయగా.. ఆ మరుసటి రోజు వైద్య, శాఖాధికారులు వెళ్లి ఆస్పత్రిని సీజ్ చేశారు.

ఖమ్మం చర్చి కాంపౌండ్ వద్ద ఉన్న సుగుణ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో అబార్షన్లు నిర్వహిస్తున్నారన్న ఫిర్యాదుతో వైద్య, ఆరోగ్యశాఖాధికారులు గురువారం రాత్రి తనిఖీలు చేయగా నివ్వెరబోయే అంశాలు వెలుగుచూశాయి. ఒకేరోజు ఐదుగురికి అబార్షన్ చేశారని, మరో ఇద్దరికి అబార్షన్ చేసేందుకు సిద్ధమైనట్లు గుర్తించి తాళం వేశారు.



- విచ్చలవిడిగా లింగనిర్ధారణ పరీక్షలు
- ఆడశిశువు అని తేలితే భ్రూణహత్య
- జిల్లాలోని స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రులపై కరువైన నిఘా
- ఫలితంగా చెలరేగిపోతున్న యాజమాన్యాలు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో అడ్డూఅదుపు లేకుండా భ్రూణహత్యలు జరుగుతున్నాయని ఇటీవల ఘటనల ద్వారా తెలుస్తోంది. లింగ నిర్ధారణ పరీక్ష చేయించడం, కడుపులో పెరుగుతున్నది ఆడబిడ్డ అని తెలిస్తే చాలు చిదిమేస్తున్నారు. లింగ నిర్ధారణ చేయడం కఠినమైన నేరమైనా జిల్లాలోని పలు ఆస్పత్రుల యాజమాన్యాలు, స్కానింగ్ సెంటర్లకు అదేమీ పట్టడం లేదు. వివిధ ఆస్పత్రుల్లో అడ్డగోలుగా అబార్షన్లు నిర్వహిస్తుండటంతో జిల్లాలో ఆడశిశువుల సంఖ్య తగ్గిపోతోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం జిల్లాలో ప్రతీ వేయి మంది అబ్బాయిలకు గాను 929 మంది అమ్మాయిలు మాత్రమే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. ఆడ శిశువులను పిండ దశలోనే విచ్ఛిన్నం చేయడంతోనే ఈ పరిస్థితి ఏర్పడుతోందని చెబుతున్నారు. కాసులకు కక్కుర్తి పడుతున్న ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్ల యాజమాన్యాల తీరుతో ఆడశిశువులు కడుపులోనే కరిగిపోతున్నారు. ఈ విషయంలో నిఘా వేయాల్సిన వైద్య, ఆరోగ్య శాఖ తన బాధ్యతను మరవగా నిర్వాహకులకు అడ్డులేకుండా పోతోంది.

చట్టం అంటే లెక్కలేదు..

ఆడశిశువులను కాపాడుకోవాల్సిన అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన వైద్య ఆరోగ్య శాఖ చోద్యం చూస్తుండడంతో రోజురోజుకు భ్రూణహత్యలు పెరుగుతున్నాయి. ఇక అనుమతి లేకుండా స్కానింగ్ సెంటర్లు నిర్వహిస్తున్న కొందరు గర్భస్థ శిశువులను చిదిమేస్తూ సమాజానికి ద్రోహం చేస్తున్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిషేధిస్తూ ప్రభుత్వం 'గర్భస్థ పిండ పరీక్ష ప్రక్రియ '(నియంత్రణ, దురుపయోగ నివారణ) చట్టం – 1994ను తీసుకువచ్చింది. ఈ చట్టానికి 2003లో సవరణలు చేసి 'గర్భధారణ పూర్వ గర్భస్థ పిండ ప్రక్రియ'(లింగ ఎంపిక నిషేధం) చట్టంగా మార్చారు. దీని ప్రకారం డీఎంహెచ్‌ఓ అనుమతి తీసుకున్న స్కానింగ్ సెంటర్లనే కొన్ని వైద్య పరీక్షలు నిర్వహించడానికి ఆస్కారముంటుంది. అలాకాకుండా లింగ నిర్ధారణ పరీక్ష చేసినా, పిండం దశలోనే చిదిమేసినా చట్టప్రకారం చేసిన వారికి, చేయించుకున్న వారికి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అవుతుంది. మొదటిసారి పట్టుబడితే మూడేళ్ల జైలు రూ.శిక్ష, 10 వేలు జరిమానా విధిస్తారు. మళ్లీ అదే నేరానికి పాల్పడితే ఇంకా కఠినశిక్షలు ఉన్నాయి.



ఓ ప్రైవేట్ ఆస్పత్రిని సీజ్ చేస్తున్న సిబ్బంది

ఫిర్యాదులు అందితేనే తనిఖీలు

జిల్లాలో ప్రస్తుతం 85 స్కానింగ్ సెంటర్లకు మాత్రమే వైద్య ఆరోగ్య శాఖ అనుమతులు ఉన్నాయి. గర్భం దాల్చిన మహిళకు కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే పరీక్షలు చేయాల్సి ఉంటుంది. జన్యు సంబంధమైన అంశాల్లో పిండంలో లోపాలు తెలుసుకోవడానికి అల్ట్రా సౌండ్, స్కానింగ్ పద్ధతి ఉపయోగిస్తారు. రెండుసార్లు అంత కంటే ఎక్కువ సార్లు గర్భస్రావం జరిగినప్పుడు, గర్భిణీ, ఆమె భర్త కుటుంబీకుల్లో ఎవరికైనా బుద్ధి మాంద్యం, శారీక వైకల్యం, జన్యు సంబంధిత వ్యాధులు ఉంటే మాత్రమే గర్భస్థ పిండానికి పరీక్ష చేయించాలని చట్టం చెబుతోంది. కానీ ఆరోగ్య శాఖ అధికారులు మొద్దునిద్ర వీడకపోవడంతో కడుపులో పెరుగుతున్నది ఆడ, మగా అని తెలుసుకునేందుకు ఎంత డబ్బయినా చెల్లించి పలువురు పరీక్షలు చేయిస్తున్నారు. కాగా, లింగ నిర్ధారణ పరీక్ష చేసి, గర్భస్రావం చేసేందుకు సెంటర్లు, ఆస్పత్రుల నిర్వాహకులు రూ.30 నుండి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అయితే అధికారులు ఫిర్యాదు అందినప్పుడు మాత్రమే తనిఖీ చేస్తుండడం.. ఆతర్వాత తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రుల నిర్వాహకుల దందా సాగుతోంది.

ఆర్‌ఎంపీలే మధ్యవర్తులు

జిల్లా కేంద్రంలోని సుగుణ ఆస్పత్రిలో అధికారులు తనిఖీ చేసిన సమయాన అబార్షన్ చేయించుకునేందుకు ఖమ్మం జిల్లా నుంచే కాక ఇతర జిల్లాల నుంచి సైతం కొందరు వచ్చినట్లు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లోని ఆర్‌ఎంపీలు మధ్యవర్తులు గా వ్యవహరిస్తూ దంపతులను ఇక్కడకు తీసుకొస్తున్నారని.. ఆపై ఆస్పత్రుల యాజమాన్యాల నుంచి కమీషన్ తీసుకుంటున్నట్లు తెలిసింది. నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీ క్షలు చేస్తున్న స్కానింగ్ సెంటర్లు జిల్లా కేంద్రంలోనే చాలానే ఉండగా.. ఆస్పత్రుల యాజమాన్యాలు వారికి జత కలుస్తుండడంతో అబార్షన్లు యథేచ్ఛగా సాగుతున్నాయి. వైద్య, ఆరోగ్యశాఖాధికారులు అప్రమత్తంగా ఉండి తనిఖీలు చేస్తూ, డెకాయ్ ఆపరేషన్లు నిర్వహిస్తే వీటికి అడ్డుకట్ట పడే అవకాశమున్నా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.


అబార్షన్లు నిర్వహిస్తే కఠిన చర్యలు



లింగ నిర్ధారణ పరీక్ష నిర్వహించినా, అబార్షన్ చేసినట్లు తేలినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. అలాంటి స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రులను సీజ్ చేస్తాం. ఇప్పటికే రెండు ఆస్పత్రులను సీజ్ చేశాం. జిల్లాలోని స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రులపై నిఘా కొనసాగుతోంది. తరచూ దాడులు నిర్వహిస్తూ అబార్షన్ల కట్టడికి కృషిచేస్తాం.

– డాక్టర్ బీ.మాలతి, డీఎంహెచ్‌ఓ

భానుడి భగభగ



జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. గురువారం వరకు 40 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. శుక్రవారం కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలో అత్యధికంగా 43.3 డిగ్రీలుగా నమోదైంది. రాష్ట్రంలో నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతల్లో గుబ్బగుర్తి మొదటి స్థానంలో నిలిచింది. జిల్లాలోని మరో 12 ప్రాంతాల్లో 40 డిగ్రీల నుంచి 41.5 డిగ్రీల వరకు నమోదు కాగా.. ఎండలకు తోడు వడగాలులు మొదలవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే వచ్చే రెండు నెలల తట్టుకోవడం ఎలా అని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. – సాక్షి ప్రతినిధి, ఖమ్మం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతలు

ప్రాంతం	డిగ్రీల్లో
గుబ్బగుర్తి	43.3
బచ్చోడు	41.5
కాకరవాయి	41.5
లింగాల	41.0
పెనుబల్లి	40.8
నేలకొండపల్లి	40.8
కూసుమంచి	40.8
కొణిజర్ల	40.8
తల్లాడ	40.7
ఖానాపురం	40.6
మధిర	40.2

జిల్లావ్యాప్తంగా మండుతున్న ఎండలు

- గుబ్బగుర్తిలో అత్యధికంగా 43.3 డిగ్రీలు
- రాష్ట్రంలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రత ఇక్కడే నమోదు
- ఏడు ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగానే..
- ఎండకు తోడవుతున్న వడగాలులు



40 కేంద్రాల్లో 38 డిగ్రీలకు పైనే..

జిల్లాలోని 40 ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాల ద్వారా రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సంస్థ ఉష్ణోగ్రతలను నమోదు చేస్తుంది. 35 డిగ్రీల లోపు ఉంటే సాధారణం (గ్రీన్)గా.. 35 నుంచి 40 డిగ్రీల వరకు మధ్యస్థం(ఎల్లో)గా గుర్తిస్తారు. ఆపై 40 నుంచి 45 డిగ్రీల వరకు నమోదైతే ఆరెంజ్ అలర్ట్, 45 డిగ్రీల పైన రెడ్ అలర్ట్ జారీ చేస్తారు. అయితే, జిల్లాలోని 13 కేంద్రాల్లో శుక్రవారం 40 డిగ్రీలకు పైన, మిగిలిన 27 కేంద్రాల్లో 38 డిగ్రీలకు పైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గురువారం పోలిస్తే గణనీయంగా ఉష్ణోగ్రత పెరగడమే కాక జిల్లావ్యాప్తంగా వడగాలులు కూడా వీచాయి. ఈ పరిస్థితితో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రజలు బయటకు రావాలంటే ఒకటికి, రెండు సార్లు ఆలోచించాల్సి వచ్చింది.

అడుగంటుతున్న నీరు

ఈ ఏడాది తీవ్ర వర్షాభావంతో జిల్లాలోని జలాశయాలు వట్టిపోయాయి. ప్రధాన రిజర్వాయర్లు అయిన పాలేరు, వైరా, బేతుపల్లి, లంకాసాగర్‌లో నీరు అడుగంటింది. మిగతా చిన్నాపెద్ద చెరువుల్లో కూడా నీళ్లు అడుగంటడంతో ఎక్కడ చూసినా పొడి వాతావరణం నెలకొంది. బోర్లు, బావుల్లో నీళ్లు లేక సాగు చేసిన పంటలు పలు ప్రాంతాల్లో ఎండిపోయాయి. మరో మూడు, నాలుగు రోజులు అత్యధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

స్వర్ణకవచధారణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలోని అంతరాలయంలో శుక్రవారం స్వామివారి మూలమూర్తులు స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీలక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

మళ్లీ కేంద్రంలో అధికారం మాదే..

- ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధమయ్యారు
- బీజేపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి, అభ్యర్థి వినోద్‌రావు



మాట్లాడుతున్న అభ్యర్థి వినోద్‌రావు, పక్కన సుధాకర్‌రెడ్డి, నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్రంలో మళ్లీ ప్రధాని మోదీ నేతృత్వాన బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ తమిళనాడు, కర్నాటక సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తెలిపారు. ఖమ్మంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎలాంటి స్కాంలకు తావులేకుండా సుపరిపాలన అందిస్తున్న మోదీ నాయకత్వాన్ని బలపర్చడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీ 420 సీట్లు గెలవనుండగా, అందులో ఖమ్మం కూడా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు ఓటు వేసినా వృథాయేనని, ఈ విషయాన్ని గుర్తించి ప్రజలు బీజేపీకి ఓటు వేసి ధర్మాన్ని గెలిపించాలని కోరారు. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలుకాలేదని.. అదే మోదీ హామీ ఇస్తే నెరవేర్చడం ఖాయమని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులు సున్నా రవి, శ్యాంరాథోడ్‌తో పాటుదొంగల సత్యనారాయణ, దిద్దుకూరి వెంకటేశ్వర్లు, చావా కిరణ్, రంగా కిరణ్, రీగన్, ఏలూరు నాగేశ్వరావు, విజయరాజు, అల్లిక అంజయ్య, సుదర్శన్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల్లో అలజడి

- కొనసాగుతున్న కూల్చివేతల పర్వం
- నిన్న వైఎస్సార్ నగర్.. నేడు పువ్వాడనగర్‌లో..
- ఆందోళన చెందుతున్న స్థలాల కొనుగోలుదారులు



పువ్వాడ నగర్‌లో నిర్మాణాన్ని కూల్చివేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) అన్యాయం చేయొద్దని కోరుతున్న ఓ కుటుంబ సభ్యులు

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: పేదలతో పాటు వివిధ వర్గాల వారికి కేటాయించిన అసైన్డ్ భూముల్లో ఇళ్ల నిర్మాణానికి అనుమతి లేదని.. లబ్ధిదారులు ఇతరులకు అమ్ముకున్నారని చెబుతూ రంగంలోకి దిగిన అధికారులు కూల్చివేతలు మొదలుపెట్టారు. ఇటీవల జిల్లాలో ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం కలెక్టర్ భూరక్షణా బృందాలను ఏర్పాటుచేశారు. తరచుగా ఆయా బృందాలతో సమావేశమవుతున్న కలెక్టర్ సూచనలతో రెవెన్యూ, కార్పొరేషన్, పంచాయతీ అధికారులు పోలీసు బందోబస్తు నడుమ అసైన్డ్ భూముల్లో నిర్మాణాలను కూల్చివేస్తున్నారు. ఖమ్మం 8వ డివిజన్ వైఎస్సార్ నగర్‌లో 40 ప్లాట్లలో నిర్మాణాలను గురువారం కూల్చివేయగా.. శుక్రవారం రఘునాథపాలెం మండలం పువ్వాడనగర్ పంచాయతీలో 12పైగా నిర్మాణాలను నేలమట్టం చేశారు. దీంతో ఎప్పుడేం జరుగుతుందోనని ఆక్రమణదారుల్లో వణుకు పుడుతుండగా... రూ.లక్షలు వెచ్చించి చేపట్టిన నిర్మాణాలను కూల్చివేస్తుండడంతో ఇంకొందరు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

ఇతరుల చేతుల్లోకి వెళ్లడంతో...

ఖమ్మం ఖానాపురం రెవెన్యూ సర్వే నంబర్ 37లో ప్రభుత్వం రైతుల వద్ద సేకరించిన భూమిలో 2వేల మందికి పైగా ఇళ్ల స్థలాలు కేటాయించింది. అలాగే, 439 మంది ఎక్స్ సర్వీస్‌మెన్లకు కూడా ఇంటి పట్టాలు పంపిణీ చేసింది. అయితే, ఇందులో చాలా మంది కుటుంబ అవసరాల నిమిత్తం అమ్ముకున్నారు. ఇలా సగానికి పైగానే స్థలాలు ఇతరుల చేతుల్లోకి వెళ్లాయి. ఇంకొందరు తప్పుడు పత్రాల సృష్టించి అమ్మకాలు చేస్తుండటం నిర్మాణ సమయాన వివాదం జరుగుతోంది. కాగా, అసలు పట్టాదారుల నుండి ఒకటి, రెండు, మూడు చేతులు మారగా రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన కొందరు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇంకొందరు తక్కువ ధరకే వస్తుందనే ఆశతో కొనుగోలు చేసినట్లు తెలిసింది. అయితే, అసైన్డ్ భూముల్లో ప్రభుత్వం పట్టా కేటాయించిన వారు అనుభవించాలే తప్ప అమ్మొద్దనే నిబంధన ఉన్నా అది ఉల్లంఘించడంతో కూల్చివేతలకు శ్రీకారం చుట్టారు.

పట్టా రద్దు చేసినా నిర్మాణాలు

రఘునాథపాలెం మండలం పువ్వాడనగర్‌లో ప్రభుత్వం 2021–22లో అసైన్డ్‌భూమిలో పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేసింది. ఇందులో చాలామంది నిర్మాణాలు చేపట్టకపోగా, కొందరు అమ్ముకున్నారు. ఈనేపథ్యాన రెవెన్యూ అధికారులు సర్వే చేసి 767కు పైగా ప్లాట్లను రద్దు చేశారు. ఈ స్థలానికి కొంత భాగం ఫెన్సింగ్ కూడా వేయించినట్లు రఘునాథపాలెం తహసీల్దార్ విల్సన్‌బెన్నీ తెలిపారు. అయినా నిర్మాణాలు సాగిస్తుండడంతో కూల్చివేతలు మొదలుపెట్టారు. అధికారులు ఆలోచన మంచిదే అయినా నిబంధనల తెలియక పట్టాదారుల నుంచి స్థలాలు కొనుగోలు చేసిన వారు ఇప్పుడు రూ.లక్షల్లో నష్టపోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. దీంతో అలాంటి వారు తమకు న్యాయం చేయాలంటూ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

క్లుప్తంగా

'అక్రమ అబార్షన్లు వైద్య వృత్తికే మచ్చ'

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మంలో ఇటీవల వెలుగుచూసిన అక్రమ అబార్షన్ల వ్యవహారం వైద్య వృత్తికి మచ్చ తెచ్చేలా ఉందని ఐఎంఏ, ప్రసూతి వైద్యుల సంఘం బాధ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు కంభంపాటి నారాయణరావు, జగదీష్, ప్రసూతి వైద్యుల సంఘం ప్రతినిధులు ముద్వా లక్ష్మీరాజేశ్వరి, రెహానా బేగం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైద్య వృత్తికి మచ్చ తెచ్చేలా ఎవరు వ్యవహరించినా సహించేది లేదని, వీటికి వ్యతిరేకంగా తాము ముందు నిలిచి పోరాడతామని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగే అబార్షన్లకు అడ్డుకట్ట వేయటానికి అధికారులకు సహకరిస్తామని తెలిపారు. అయితే, ఎక్కడో ఓ చోట వైద్యులు ఇలాంటివి చేస్తున్నా, ఎక్కువసార్లు వైద్య వృత్తికి సంబంధం లేని వారే ఉంటున్నారని, వీరిని ప్రజలు కూడా నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు.

పీఏసీఎస్ డైరెక్టర్‌పై హత్యాయత్నం


వివరాలు వెల్లడిస్తున్న వెంకటరెడ్డి

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం పీఏసీఎస్ డైరెక్టర్ కాటం వెంకటరెడ్డిపై తనపై హత్యాయత్నం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చెరువుమాధారంలో జరుగుతున్న అంకమ్మ జాతరకు గురువారం రాత్రి కుటుంబీకులతో కలిసి తాను వెళ్లగా అదే గ్రామానికి చెందిన మరో డైరెక్టర్ అనిల్ తనపై దాడి చేశాడని తెలిపారు. కత్తి పట్టుకుని చంపేందుకు మీదకు రాగా, తన భార్య అడ్డుపడిందని.. ఆపై పరుగులు తీస్తూ ప్రాణాలు కాపాడుకున్నామని పేర్కొన్నారు. పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని తన హత్యాయత్నానికి పాల్పడగా, గతంలోనూ ఘర్షణకు దిగాడని వెంకటరెడ్డి శుక్రవారం పోలీసులకు చేసిన ఫిర్యాదులో తెలిపారు.

ప్రైవేట్ ఫ్యాక్టరీకి కేటాయించొద్దు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్రంలోనే ఆయిల్ పామ్ తోటల సాగు అత్యధికంగా ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏరియాను ప్రైవేట్ ఫ్యాక్టరీకి కేటాయించొద్దని తెలంగాణ రాష్ట్ర ఆయిల్‌పాం గ్రోయర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఆలపాటి రామచంద్ర ప్రసాద్, కోటగిరి సీతారామస్వామి కోరారు. అశ్వారావుపేట మండలం నారంవారిగూడెంలోని ఆయిల్‌ఫెడ్ డివిజనల్ కార్యాలయం శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రైవేట్ కంపెనీ కేవలం ఆరు మండలాల్లోనే పామాయిల్ తోటలను సాగు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆయా మండలాలను సైతం ఆయిల్‌ఫెడ్‌కు అప్పగించి, జిల్లాను ప్రైవేట్ కంపెనీకి కేటాయించాలనే యోచనను విరమించుకోవాలని కోరారు. అనంతరం ఆయిల్‌పామ్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో బండి భాస్కర్, జేకేవీ.రమణారావు, మొగళ్లపు చెన్నకేశవరావు, మల్లిరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, అంకత మహేశ్వరరావు, కేవీ.సత్యనారాయణ, మురళీ, దొడ్డా ప్రసాద్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న వ్యక్తి

ఖమ్మంక్రైం: ఖమ్మం ప్రకాష్ నగర్ బ్రిడ్జి సమీపాన గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో తీవ్రంగా గాయపడిన ఆయనను అన్నం ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. సదరు వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం ఇవ్వాలని జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు సూచించారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం


రక్తపు మడుగులో పడి ఉన్న అఫ్జాద్

వైరా: వైరాకు చెందిన ఓ వ్యక్తి కుటుంబ కలహాలతో శుక్రవారం రాత్రి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక చేపలకాలనీకి చెందిన షేక్ లాల్ అఫ్జాద్‌కు మధిర మండలం ఆత్కూర్‌కు చెందిన షేక్ రంజాన్‌బీతో 18 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉండగా, నిత్యం గొడవలు జరుగుతుండడంతో పెద్దలు పంచాయతీ నిర్వహించేమేకాక లాల్ అఫ్జాద్‌పై రంజాన్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంతలోనే శుక్రవారం రంజాన్‌బీ పుట్టింటికి వెళ్లడంతో అఫ్జాద్ బస్టాండ్ ఎదురుగా చేయి కోసుకోగా తీవ్ర రక్తస్రావమై స్పృహ కోల్పోయాడు. దీంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు చేరుకుని ఆయనను ఆస్పత్రికి తరలించారు.

పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.13,045

సెలవులకు ముందే సందడి!



చిన్నారులతో ప్రాక్టీస్ చేయిస్తున్న కోచ్ (ఇన్‌సెట్) పరుగులు తీస్తున్న చిన్నారులు..

ఔత్సాహికులతో కిక్కిరిసిపోతున్న స్టేడియం
- అథ్లెటిక్స్ ప్రాక్టీస్‌పై పలువురి ఆసక్తి
- పిల్లలకు తొలుత ఫిట్‌నెస్ పరీక్ష.. ఆ తర్వాతే ఈవెంట్లలో శిక్షణ

ఖమ్మం స్పోర్ట్స్: సహజంగా విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించాక వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు శిబిరాలు మొదలవుతాయి. కానీ ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో మాత్రం అథ్లెటిక్స్ శిక్షణ ఇప్పటికే జోరందుకుంది. ఔత్సాహికులు పెద్ద సంఖ్యలో తరలివస్తుండడంతో ఫిట్‌నెట్ పరీక్ష నిర్వహించి ఈవెంట్లలో శిక్షణ ఇవ్వడంపై కోచ్‌లు దృష్టి సారించారు. విద్యాసంస్థలు ఒకటే పూట నడుస్తుండడంతో సాయంత్రం పదేళ్లలోపు బాలబాలికలకు తల్లిదండ్రులు మైదానానికి తీసుకొస్తుండగా సందడిగా మారుతోంది.

గ్రూప్‌లుగా శిక్షణ

స్టేడియంకు వస్తున్న వారిని సీనియర్, జూనియర్లుగా విభజించి శిక్షణ ఇస్తున్నారు. మరోపక్క ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా కోచ్‌లు దృష్టి సారించారు. అథ్లెటిక్స్‌లో 100, 200, 400, 800 తదితర ఈవెంట్లలో శిక్షణ కోసం ఎక్కువ మంది ఆసక్తి కనబరుస్తున్నారు. గత ఏడాది వేసవి శిబిరాల్లో శిక్షణ తీసుకున్న వారు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారు. దీంతో ఈసారి కనీసం పది మంది ఔత్సాహికులను గుర్తించి నైపుణ్యం ఉన్న వారికి దీర్ఘకాలిక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. కాగా, ఇప్పుడే స్టేడియంకు ఔత్సాహికులు పోటెత్తుతుండడంతో వేసవి సెలవులు మొదలయ్యాక ఈ సంఖ్య మరింత పెరుగుతందని భావిస్తున్నారు.

పరుగులో రాణిస్తా



నేను 100, 200 మీటర్ల పరుగులో రాష్ట్ర, జాతీయస్థాయిలో సత్తా చాటేందుకు కృషి చేస్తా. రోజు స్టేడియంకు అమ్మానాన్నలు తీసుకొస్తున్నారు. వాళ్ల ఆశల మేరకు బాగా ప్రాక్టీస్ చేస్తా. స్టేడియంలో చాన్నాళ్లుగా ప్రాక్టీస్ చేస్తున్న సీనియర్లను చూసి మెళకువలు నేర్చుకుంటున్నాం.

– భవిత

ప్రతిరోజు వస్తున్నా..



నిరంతరం ప్రాక్టీస్ చేస్తే పతకాలు సాధించొచ్చని అమ్మానాన్న చేప్పారు. అందుకే ఎక్కడకు వెళ్లకుండా ప్రతిరోజు స్టేడియంకు వస్తున్నా. రాష్ట్ర, జాతీయస్థాయిలో టోర్నీల్లో విజయం సాధిస్తాననే నమ్మకం ఉంది. ఇందుకోసం ఒక్కరోజు వదలకుండా స్టేడియంకు వస్తున్నాను.

– లోహిత

స్టేడియంలో ఉత్తమ కోచ్‌లు



పటేల్ స్టేడియంలో సీనియర్ కోచ్‌లు ఉన్నారు. వీరి సేవలను సద్వినియోగం చేసుకుంటే రాష్ట్ర, జాతీయ టోర్నీలో పతకాలు సాధించడం సులువవుతుంది. అథ్లెటిక్స్ అకాడమీ ఉన్నందున మంచి అథ్లెట్లు తయారవుతున్నారు. క్రీడాకారులకు అన్ని వసతులు కల్పిస్తున్నాం.

– టి.సునీల్‌కుమార్‌రెడ్డి, డీవైఎస్‌ఓ

శిక్షణ తీరు బాగుంది



ఇప్పటికే అండర్–14 బాలికల విభాగంలో జాతీయస్థాయి అథ్లెటిక్స్‌ల్లో రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించా. కోచ్ గౌస్ ఇస్తున్న శిక్షణ బాగుంది. మరింత సాధన చేసి జాతీయ పోటీల్లో కూడా పతకం సాధించాలనేది లక్ష్యం. అందుకోసం నిరంతరం ప్రాక్టీస్ చేస్తున్నా.

– రిష్విత్రీ, జాతీయ అథ్లెట్

క్రీడలపై ఆసక్తి



చిన్నప్పటి నుంచే క్రీడలపై ఆసక్తిఉంది. అందుకే సాయంత్రం అయిందంటే చాలు ప్రాక్టీస్‌కు వస్తున్నా. ఎండాకాలం సెలవుల్లో మెరుగైన శిక్షణ తీసుకుని రాష్ట్రస్థాయి టోర్నీల్లో ప్రతిభ చాటాలనేది లక్ష్యం. కోచ్ వద్ద మెళకువలు నేర్చుకుంటూ సీనియర్లతో పాటు ప్రాక్టీస్ చేస్తున్నాను.

– కృష్ణన్

ముందు ఫిట్‌నెస్ ప్రాక్టీస్



శిక్షణ కోసం వచ్చే వారికి ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహిస్తున్నాం. అంతా బాగుంటేనే శిక్షణ మొదలుపెడుతున్నాం. లేకుంటే ఫిట్‌నెస్ పెంచుకునేలా సూచనలు చేస్తున్నాం. వేసవి సెలవుల్లో శిక్షణకు వచ్చే వారు మరింత పెరుగుతారు. అందులో ఉత్సాహవంతులను తీర్చిదిద్దుతాం.


– ఎం.డి.గౌస్, సీనియర్ కోచ్, అథ్లెటిక్స్ అకాడమీ

కాంగ్రెస్ హయాంలో అన్ని రంగాల అభివృద్ధి


నాగేశ్వరరావును సన్మానిస్తున్న కిసాన్ సెల్ నాయకులు

ముదిగొండ: కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించడమే కాక అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు తెలిపారు. ముదిగొండ మండలం కమలాపురంలో జరుగుతున్న శ్రీఅంకమ్మ జాతరకు డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి శుక్రవారం ఆయన వచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీఅంకమ్మ, శ్రీమహాలక్ష్మి, శ్రీమద్దిరావమ్మ, పెద్దమ్మ అమ్మవార్లకు పూజలు చేయగా.. కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు వల్లూరి భద్రారెడ్డి అధ్యక్షతన రాయల నాగేశ్వరరావును సన్మానించారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ నేతృత్వాన సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలుచేస్తుండగా, రైతుల సంక్షేమానికి నిధుల కేటాయింపు జరుగుతోందని తెలిపారు. ఈకార్యక్రమంలో కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు మొక్క శేఖర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, సొసైటీ డైరెక్టర్ వనం ప్రదీప్తబాబుతో పాటు పసుపులేటి దేవేంద్రం, ఇలవల పుల్లారెడ్డి, శిరిగిరి కుల్లాయ్, వట్టికూటి వెంకటేశ్వర్లు, ఎండీ.అజ్గర్, బాబురాంరెడ్డి, వాక వెంకటేశ్వరరెడ్డి, పందిరి అంజయ్య, బిచ్చాల బిక్షం, ఆదినారాయణరెడ్డి, ఏలూరి హన్మంతరావు, కోలేటి నాగేశ్వరరావు, వీరారెడ్డి, రామయ్య, పాల్గొన్నారు.


'జిల్లాలో మతతత్వ పార్టీలకు చోటు లేదు'



సమావేశంలో మాట్లాడుతున్న యర్రా శ్రీకాంత్

ఖమ్మంమయూరిసెంటర్: వామపక్ష భావజాలం కలిగిన ఖమ్మం జిల్లాలో మతోన్మాద బీజేపీకి చోటు లేదని.. గతంలో పార్టీకి ఇక్కడకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తే తిప్పికొట్టినట్లే ఈసారి చేస్తామని సీపీఎం జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి, రాష్ట్ర నాయకుడు యర్రా శ్రీకాంత్ తెలిపారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మతోన్మాద రాజకీయాలతో జిల్లా రాజకీయాలను కలుషితం కానివ్వబోమని చెప్పారు. ఒకటి, రెండు ప్రాంతాల్లో అభివృద్ధి జరిగితే జిల్లా అభివృద్ధి కాదని.. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం మంత్రులు పాటుపడాలని కోరారు. జిల్లాలోని అనేక గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తుతున్నందున ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే, జిల్లాలో కార్మికులు ఎక్కువగా ఉన్నందున ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మించాలని కోరారు. అంతేకాక ఖమ్మం మార్కెట్‌కు సరుకులు తీసుకొచ్చే రైతుల కోసం మున్నేరుపై రంగనాయకుల గుట్ట సమీపాన మరో వంతెన నిర్మించాలని, కాల్వొడ్డుపై తీగల వంతెన, మున్నేరు కరకట్ట పనులు త్వరగా పూర్తయేలా చర్యలు తీసుకోవాలని శ్రీకాంత్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కోసం..


మాట్లాడుతున్న సీఈఓ శ్రీనివాసరెడ్డి

సత్తుపల్లిటౌన్: తెలుగు వారి ఘనతను విశ్వవ్యాప్తం చేసేందుకే తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ఏర్పడిందని సీఈఓ డాక్టర్ బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సత్తుపల్లిలోని విశ్వశాంతి విద్యాలయానికి చెందిన 62 మంది విద్యార్థులు శాస్త్రీయ వాస్తవాలు, వివరణలను వెల్లడించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు కోసం కృషి చేస్తున్నారు. ఒక్కొక్కరు ఒక్కో అంశంపై 120 నిమిషాల పాటు దృశ్యరూప వీడియోలు రికార్డు చేయనుండగా, శుక్రవారం ట్రయల్‌రన్ పూర్తయింది. ఈకార్యక్రమాన్ని పరిశీలించిన శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ న్యాయనిర్ణేతల సమక్షాన 31వ తేదీన మరోమారు పరీక్షించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేస్తామని తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

భార్యను కాపాడే క్రమంలో ప్రమాదం


వల్లవరపు రవి (ఫైల్)

పెనుబల్లి: విద్యుత్ షాక్ నుంచి భార్యను కాపాడిన వ్యక్తి అపస్మారకస్థితిలోకి వెళ్లగా ఆస్పత్రికి తరలించే క్రమంలో కన్నుమూశాడు. ఈ విషాద ఘటన పెనుబల్లి మండలం కుప్పెనకుంట్లలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన వల్లవరపు రవి(43) భార్య ఉదయం స్నానం చేసి వస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగను తాకడంతో షాక్‌కు గురైంది. ఈ విషయాన్ని గమనించి రవి భార్యను కాపాడే క్రమాన షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఈమేరకు కుటుంబీకులు ఆయనను హుటాహుటిన తిరువూరు ఆస్పత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో మృతి చెందాడు. భార్య ప్రాణాలు కాపాడిన ఆయన చనిపోవడంతో గ్రామంలో విషాదం నెలకొనగా.. వీ.ఎం.బంజర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

తల్లాడ: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై కొండల్‌రావు తెలిపిన వివరాలు... మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన గుండ్ల ఉపేందర్‌రావు స్థానికంగా రహదారి పక్కన హార్వెస్టర్‌ను దింపుతుండగా సత్తుపల్లి నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన ఉపేందర్‌రావును చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించినట్లు ఎస్సై తెలిపారు.

సెల్‌టవర్‌కు నిప్పంటించిన మావోయిస్టులు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ప్రైవేట్ నెట్‌వర్క్‌కు చెందిన సెల్ టవర్‌ను మావోయిస్టులు దగ్ధం చేశారు. కొండగావ్ జిల్లా కేజాంగ్‌లో ఉన్న సెల్‌టవర్ వద్దకు గురువారం అర్ధరాత్రి వచ్చిన మావోయిస్టులు కంట్రోల్ ప్యానల్, బ్యాటరీ బోర్డులపై డీజిల్ చల్లి నిప్పంటించారు. అక్కడ 'కేంద్రంలో పాలన సాగిస్తున్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు దేశాన్ని హిందూ దేశంగా మార్చేందుకు కుట్రలు చేస్తున్నందున ప్రజలంతా వ్యతిరేకించాలి' అని కోరుతూ మావోయిస్టు పార్టీ తూర్పు బస్తర్ డివిజన్ కమిటీ పేరిట బ్యానర్లు, కరప త్రాలు వదిలారు. ఘటనాస్థలిని డిప్యూటీ సూపరింటెండెంట్ సతీశ్‌భార్గవ్ పరిశీలించారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యాన మావోయిస్టులు ఇలాంటి ఘటనలకు పాల్పడుతుండటంతో ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు.

దంతెవాడ పోలీసుల అదుపులో మావోయిస్టు

చర్ల: పోలీసు బలగాలను చూసిపారిపోతున్న ఓ మావోయిస్టును వెంబడించిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. దంతెవాడ జిల్లాలోని కట్టేకల్యాణ్ పోలీస్ స్టేషన్ పరిధి తుమ్మాపాల్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో పోలీసులతో పాటు సీఆర్‌పీఎఫ్, డీఆర్‌జీ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ సందర్భంగా నాదేనార్ సమీపంలోని అటవీ ప్రాంతం వద్ద పోలీసులను గమనించిన ఓ మావోయిస్టు పారిపోతుండగా ఆయనను వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. ఆయనను విచారించగా నాదేనార్‌కు చెందిన కవాసి హిడ్మా అలియాస్ సుయికాగా తేలింది. సదరు వ్యక్తిపై కట్టేకల్యాణ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులు ఉండగా.. రిమాండ్‌కు తరలించినట్లు దంతెవాడ ఎస్పీ గౌరవ్‌రాయ్ తెలిపారు.

ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టిన ఆటో

- ఒకరు మృతి, ఇంకొకరి పరిస్థితి విషమం


తోట గోపి (ఫైల్)

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లిలో శుక్రవారం రాత్రి ఆగి ఉన్న టిప్పర్‌ను ఆటో ఢీకొట్టగా తీవ్రంగా గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. ఇదేఘటనలో ఇంకో వ్యక్తికి గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. వివరాలు... పందిళ్లపల్లి గ్రామానికి చెందిన లింగం నాగరాజు ఆటోలో ఆయనతో పాటు లింగం మహేష్, ఖమ్మం అగ్రహారం కాలనీకి చెందిన తోట గోపి(22), సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం రేవూరుకు చెందిన ఈర్ల మహేష్ ఓ వివాహానికి సంబంధించి జగన్నాథపురం వైపు నుంచి పందిళ్లపల్లి వస్తున్నారు. ఇదేసమయాన టిప్పర్ టైరుకు పంక్చర్ కావటంతో డ్రైవర్ పందిళ్లపల్లి చివర పంక్చర్ షాపు వద్ద వాహనాన్ని నిలిపాడు. అయితే, ఆగి ఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టడంతో ఆటో నడుపుతున్న తోట గోపి, ఈర్ల మహేష్ తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులను 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో గోపి మృతి చెందాడు. అలాగే, మహేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ప్రమాద సమాచారం తెలిసిన ఎస్సై షేక్ నాగుల్‌మీరా చేరుకుని విచారణ చేపట్టారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ఖమ్మంక్రైం: ఖమ్మం వీడీవోస్ కాలనీలోని ఓ ఇంట్లో చోరీ జరగగా.. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు. కాలనీలో నివాసముంటున్న గొల్లమూడి శ్రావణ్‌కుమార్ గురువారం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి ఊరు వెళ్లారు. ఈవిషయాన్ని గుర్తించిన దుండగులు రాత్రి వేళ తాళం పగులగొట్టి ఇంట్లో నుంచి రూ.1.50లక్షల విలువైన సొత్తును చోరీ చేశారు. శుక్రవారం ఇంటికి వచ్చిన శ్రావణ్ ఈవిషయాన్ని గుర్తించిన చేసిన ఫిర్యాదుతో పోలీసులు, క్లూస్‌టీమ్ సభ్యులు పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

దర్శనం ప్రశాంతంగా ఉండాలి

- అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి
- శ్రీరామనవమి ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలి
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్


రామాలయంలో పరిశీలిస్తున్న అధికారులు శైలజా రామయ్యర్, ప్రియాంక, ప్రతీక్ జైన్


పర్ణశాలలో పంచవటి కుటీరం వద్ద అధికారులు

భద్రాచలం/దుమ్ముగూడెం: రామయ్య దర్శనానికి వచ్చే భక్తులకు వసతులు, ప్రశాంత దర్శనం కల్పించేలా అభివృద్ధి పనులు ఉండాలని తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ పేర్కొన్నారు. శుక్రవారం దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి భద్రాచలం, పర్ణశాల పర్యటనకు వచ్చారు. వీరికి కలెక్టర్ ప్రియాంక ఆల, ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రతీక్ జైన్, దేవస్థానం ఈఓ రమాదేవి భద్రాచలంలోని బ్రిడ్జి పాయింట్ వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఈఓ రమాదేవి, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం ఆలయ విశిష్టతను అర్చకులు వివరించారు. అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారు, అభయాంజనేయస్వామి ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పండితులు వేదాశీర్వచనం చేసి పట్టువస్త్రాలు, ప్రసాదాలను అందచేశారు. కాగా తొలుత కేంద్ర ప్రభుత్వ పథకం ప్రసాద్‌లో భాగంగా బ్రిడ్జి పాయింట్ పక్కన నిర్మాణం చేపట్టే టూరిజం స్థలాన్ని పరిశీలించారు. భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించేలా నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం శ్రీ సీతారామచంద్ర స్వామివారి కల్యాణం జరిగే మిథిలా స్టేడియాన్ని సందర్శించారు. వీఐపీలు, భక్తులు స్వామివారి కల్యాణం తిలకించేలా చేస్తున్న ఏర్పాట్లపై దేవస్థానం ఈఓ రమాదేవిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. దేవస్థానంలోని లడ్డూల తయారీ కేంద్రం, దేవస్థానం ప్రాంగణంలోని పరిసరాలను పరిశీలించారు. భక్తులు ఇబ్బంది లేకుండా స్వామివారిని దర్శించుకునేలా రోప్, మ్యాటును ఏర్పాటు చేయాలన్నారు.

పర్ణశాలలో..

భద్రాచలం పర్యటనకు వచ్చిన వీరు తొలుత దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాలను సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ సీతారామచంద్ర స్వామి నడయాడిన ప్రదేశాలను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా అక్కడ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ భక్తులు ఇబ్బందులు పడకుండా శ్రీ సీతారామచంద్ర స్వామి చరిత్రను తెలిసే విధంగా తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. వేసవి నేపథ్యంలో భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయం చుట్టూ మ్యాట్ వేయించాలన్నారు. టాయిలెట్లు, ఇతర వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసే ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామనవమి స్పెషల్ ఆఫీసర్ అనిల్ కుమార్, దుమ్ముగూడెం తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యను మించి భద్రాచలం అభివృద్ధి...

అనంతరం అంతర్గతంగా దేవస్థాన అధికారులతో సమావేశం నిర్వహించారు. భద్రాచలంలో చేపట్టనున్న అభివృద్ధి పనుల సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సూచనల మేరకు శాశ్వతంగా దేవస్థానంతోపాటు భక్తులకు లాభం చేకూరేవిధంగా నూతన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. అయోధ్యకు మించి భద్రాచలం అభివృద్ధి ప్లాన్ ఉండాలని సూచించినట్లు సమాచారం. ఎలక్షన్ కోడ్ నేపథ్యంలో వీటికి సంబంధించిన వివరాలను బహిర్గతం చేయొద్దని ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన, భద్రాచలం ఆర్డీఓ దామోదర్ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు బీఎస్పీ సన్నాహక సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న కామేశ్

పాల్వంచ: రానున్న లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఈనెల 31వ తేదీన ఖమ్మంలో నిర్వహించే సన్నాహక సమావేశానికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మందా ప్రభాకర్, కోఆర్డినేటర్ మతాపురం బాలయ్య హాజరవుతారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేశ్ తెలిపారు. పాల్వంచలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మంలో జరిగే సన్నాహక సమావేశంలో అభ్యర్థి విజయానికి చేపట్టాల్సిన కార్యాచరణపై రాష్ట్ర అధ్యక్షుడు దిశానిర్దేశం చేయనున్నందున నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని సూచించారు. ఈసమావేశంలో నాయకులు వినకొండ రంజిత్, కొప్పుల వినయ్‌కుమార్, గుడిమెట్ల లోకేశ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.